## మడేలేశ్వర స్వామి జాతరలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**దశ,అశ్వాపురం :** అశ్వాపురం మండల కేంద్రంలోని శ్రీ మడేలేశ్వర స్వామి జాతర మహోత్సవాల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. జాతర ప్రాంగణంలో భక్తుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన నూతన హ్యాండ్‌బోర్‌ను ఆయన ప్రారంభించారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జాతరకు వచ్చిన భక్తులను ఆప్యాయంగా పలకరించి స్వామివారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు,నాయకులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సాయం



**దశ,మణుగూరు :** మండలంలోని సాంబాయి గూడెం గ్రామానికి చెందిన చిమ్ముల లక్ష్మమ్మ (60) అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబానికి మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.3,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు నిరుపేద కుటుంబాలకు తమ సేవలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి రంగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మంగి మల్లికార్జున్ యాదవ్, అంబులెన్స్ డ్రైవర్ ప్రదీప్, సభ్యులు పి. జగన్మోహన్, తమ్మిశెట్టి వాసు, దేరంగుల నరసింహ, గ్రామ పెద్దలు ఎల్లు సత్తిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రూ.13.50 లక్షలతో సైన్స్ ల్యాబ్ ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**దశ, మణుగూరు:** లంక మల్లారం గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో రూ.13.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన సైన్స్ ల్యాబ్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా నైపుణ్యాల పెంపే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక విద్యా సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఎమ్మెల్యే, భోజన నాణ్యత, హాస్టల్ వసతులు, విద్యా సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతి, అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థినులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గుర్రంగూడ ఫారెస్ట్‌లో కేబీఆర్ తరహా మెగా ఎకో పార్కు





❖ *రూ.15 కోట్లతో 142 ఎకరాల్లో అభివృద్ధి.. డిసెంబరులో ప్రజలకు అందుబాటులోకి*

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ నగర శివారులోని గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ త్వరలో మరో ప్రధాన హరిత విహార కేంద్రంగా మారనుంది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ నేషనల్ పార్కు తరహాలో అత్యాధునిక సౌకర్యాలతో 142 ఎకరాల విస్తీర్ణంలో ఎకో పార్కును అభివృద్ధి చేసేందుకు అటవీశాఖ పనులు ప్రారంభించింది. రూ.15 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, అనంతరం అటవీశాఖ అధికారులు నిర్మాణ పనులను వేగవంతం చేశారు. ప్రకృతి అందాలను ఆస్వాదించేలా సైక్లింగ్ ట్రాక్‌లు, విశాలమైన వాక్‌వేలు, యోగా, ధ్యానం కోసం ప్రత్యేక ధ్యానమందిరాలు, పచ్చిక బయళ్లలో విశ్రాంతి వేదికలు, కుటుంబాల కోసం యాక్టివిటీ జోన్లు, చిన్నారుల కోసం ప్లే జోన్లను ఏర్పాటు చేయనున్నారు. రోజుకు సుమారు 30 వేల మంది సందర్శకులు వచ్చినా ఇబ్బంది లేకుండా పార్కును రూపుదిద్దుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని ఐదు ప్రధాన ప్రవేశ ద్వారాలను నిర్మించనున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు నగర ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా ఈ పార్కు నిలవనుంది.

**సుప్రీంకోర్టు తీర్పుతో దక్కిన అటవీ భూమి**

గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లోని భూములపై గతంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు యాజమాన్య హక్కులు చేస్తూ కోర్టులను ఆశ్రయించారు. ఇబ్రహీంపట్నం అటవీశాఖ అధికారులు సమగ్ర ఆధారాలతో పోరాడగా, సమర్పించిన పత్రాలు నకిలీవని తేల్చిన సుప్రీంకోర్టు అటవీశాఖకు అనుకూలంగా చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అనంతరం ఆక్రమణలను తొలగించిన ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిలో భాగంగా ఈ ఎకో పార్కు అభివృద్ధి పనులు చేపట్టింది. ప్రకృతి సంపదను కాపాడుతూ నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్టు, హైదరాబాద్‌కు మరో ప్రముఖ పర్యాటక, విహార కేంద్రంగా మారనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## హోటళ్లకు కుళ్లిన చికెన్.. ఆటోను అడ్డుకున్న స్థానికులు





❖ *షాద్‌నగర్‌లో వెలుగుచూసిన కల్తీ మాంసం దందా.. ఆటో సీజ్*

**దశ, షాద్‌నగర్:** ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ చికెన్ దందా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో మరోసారి వెలుగులోకి వచ్చింది. తక్కువ ధరకు లభిస్తుందనే ఆశతో కొన్ని హోటళ్లకు అనారోగ్యంతో చనిపోయిన, కుళ్లిపోయిన కోళ్ల మాంసాన్ని సరఫరా చేస్తున్న ఘటనను స్థానికులు అడ్డుకుని అధికారులకు అప్పగించారు. మహబూబ్‌నగర్ నుంచి ఆటోలో అనుమానాస్పద చికెన్‌ను షాద్‌నగర్‌కు తరలిస్తుండగా స్థానిక వ్యాపారులు, ప్రజలు వాహనాన్ని అడ్డుకుని మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న అధికారులు ఆటోలోని మాంసాన్ని పరిశీలించగా, అనారోగ్యంతో చనిపోయిన, పాడైపోయిన కోళ్ల మాంసాన్ని హోటళ్లకు తరలిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ సునీత, అక్రమంగా మాంసాన్ని తరలిస్తున్న ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు.

కుళ్లిన మాంసాన్ని కొనుగోలు చేసి వినియోగదారులకు ఆహారంగా అందిస్తున్న హోటళ్లను గుర్తించి, వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఘటనతో షాద్‌నగర్‌లో ఆహార భద్రతపై మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న ఇలాంటి అక్రమాలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.




## మహిళా హక్కుల సాధనకు ఉద్యమించాలి: మున్నా లక్ష్మీకుమారి

**దశ,మణుగూరు :** మహిళలు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలని మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి పిలుపునిచ్చారు. సోమవారం మణుగూరు మండలం సాంబాయిగూడెంలో నిర్వహించిన మహిళా సమైక్య మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ వారిపై దాడులు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వంటి ఘటనలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చట్టాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించి, వారి సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రతకు మరింత కఠిన చట్టాలు అవసరమన్నారు. కార్యక్రమంలో మహిళా సమైక్య నాయకులు, సీపీఐ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం మహిళా సమైక్య నూతన 19 మంది కమిటీని ఎన్నుకున్నారు.

## మైత్రి లహరి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

❖ *2026–27 కమిటీ బాధ్యతలు చేపట్టిన నూతన బృందం*

**దశ, పెద్ద అంబర్‌పేట్:** రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట్ పసుమాముల రోడ్డులోని మైత్రి లహరి కాలనీ సంక్షేమ సంఘం 2026-27 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఎన్నికైన సభ్యులకు సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.

కాలనీ అభివృద్ధి, నివాసితుల సంక్షేమం, పరిశుభ్రత, భద్రత, మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు నూతన కార్యవర్గం కృషి చేస్తుందని సంఘం పేర్కొంది. పారదర్శకత, జవాబుదారీతనం, సామాజిక భాగస్వామ్యంతో కాలనీని ఆదర్శ నివాస ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించింది.

**నూతన కార్యవర్గం**

అధ్యక్షుడు: జి. శేఖర్
ప్రధాన కార్యదర్శి: ఎస్. మురళి
ఉపాధ్యక్షుడు: ఎం. రవీందర్
ఆర్గనైజింగ్ సెక్రటరీ: సీహెచ్. రవీందర్ రెడ్డి
కోశాధికారి: ఎం. మధు రెడ్డి

**కార్యవర్గ సభ్యులు**

కె. దామోదర్ రెడ్డి
ఎన్. భాస్కర్ రావు
వై. ఇంద్ర రెడ్డి
పి. గణేష్
కె. అనిల్ రెడ్డి

ఈ సందర్భంగా కాలనీని మరింత పరిశుభ్రమైన, సురక్షితమైన, పచ్చదనంతో కూడిన ఆదర్శ నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి నివాసి సహకారం అవసరమని సంఘం విజ్ఞప్తి చేసింది. కొత్త కార్యవర్గానికి కాలనీ వాసులు శుభాకాంక్షలు తెలియజేశారు.






## బండరావిరాల డంపింగ్ యార్డుపై పోరు ఉధృతం

❖ *గ్రామస్తుల ఆందోళనకు బీఆర్ఎస్ అండ.. సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరిక*

**దశ, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామస్తుల ఆందోళన ఉధృతమైంది. గ్రామ ప్రజలతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించిన బీఆర్ఎస్ నాయకులు, ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నెం.20 ప్రకారం బండరావిరాల గ్రామ సర్వే నంబర్ 268లోని 494 ఎకరాల భూమిని డంపింగ్ యార్డు కోసం కేటాయించడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు *మంచిరెడ్డి కిషన్ రెడ్డి* సంఘీభావం తెలిపారు. ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల భవిష్యత్తుతో ముడిపడిన అంశాల్లో ప్రజల అభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని, డంపింగ్ యార్డు నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం విఫలమైతే, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సచివాలయం ముట్టడికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని 14 గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రజలంతా సహకరించాలి

- ప్రతి అర్హత ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు
- తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్



**దశ బూర్గంపాడు:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, తప్పుల్లేకుండా పూర్తి చేయడానికి ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు అందరూ సంపూర్ణ సహకారం అందించాలని బూర్గంపహాడ్ తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎస్ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పురోగతిని వివరించారు. మండల పరిధిలో 57 పోలింగ్ కేంద్రాలు, 48,934 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం సుమారు 50% ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, 7గురు సూపర్వైజర్ల పర్యవేక్షణలో ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపేటప్పుడు 2002 లేదా అంతకుముందు నమోదైన కుటుంబ వివరాలు తల్లిదండ్రులు, తాతయ్యఅమ్మమ్మల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఓటరు తన వివరాలు జాగ్రత్తగా పరిశీలించి సరైన సమాచారం అందించాలని కోరారు.

బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హ ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం చేరేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రక్రియపై ఏమైనా సందేహాలు ఉంటే ముందుగా తమ పరిధిలోని బీఎల్‌ఓను సంప్రదించాలని అవసరమైతే నేరుగా మండల తహసీల్దార్ కార్యాలయంలో తనను కలిసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. "ప్రజల సహకారంతో సమగ్ర, పారదర్శక, తప్పులేని ఓటరు జాబితా రూపొందించడం సాధ్యమవుతుంది" అని తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్ పేర్కొన్నారు.

## శేషగిరి నగర్‌లో కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



**దశ, మణుగూరు**: మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరి నగర్‌లో సుమారు రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక అందుబాటులోకి వస్తుందని, సీసీ రోడ్డు నిర్మాణంతో కాలనీవాసుల రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మండల, టౌన్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# స్నేహమంటే ఇదేరా..

- తండ్రిని, కొడుకును కోల్పోయిన మిత్రుడి కుటుంబానికి 80 వేలు అందించిన 26 ఏళ్లనాటి బ్యాచ్..



**దశ బూర్గంపాడు:** మండల పరిధిలోని సారపాక లో ఇటీవల ముత్యాలమ్మపేట దారిలో ఒక బుల్డోజర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఆ క్షణంలో చెలికాని ప్రవీణ్ తన 15 ఏళ్ల కొడుకు గణేష్‌ను కోల్పోయాడు. తాను కూడా మృత్యువు అంచు వరకు వెళ్లి తిరిగొచ్చాడు. ఆస్పత్రి బెడ్ మీద క్రిటికల్ కండిషన్‌లో ఉన్న ప్రవీణ్‌కు తెలియదు... తన 26 ఏళ్ల నాటి క్లాస్‌మేట్స్ తన కోసం ఏం చేస్తున్నారో.

**...26 ఏళ్ల బంధం...**
**ఒక ఫోన్ కాల్‌తో మళ్లీ కలిసింది...**

19992000లో భద్రాచలం కొర్రాజుల గుట్ట స్కూల్లో 10వ తరగతి కలిసి చదివారు వీళ్లు. రమేష్, రాజు, శేషగిరి, దుర్గారావు, పురుషోత్తం, మురళి, కోటేశ్వరావు, లక్ష్మణ్, సిద్ధిరాజు... రోజులు గడిచాయి, ఉద్యోగాలు వచ్చాయి, ఊళ్లు వేరయ్యాయి.కానీ మనసులు మాత్రం విడిపోలేదు. ప్రవీణ్ ప్రమాదం గురించి తెలియగానే "బ్యాచ్ వాట్సాప్ గ్రూప్" ఒక్కసారిగా మేల్కొంది. ఎవరి స్థాయిలో వాళ్లు... ఎవరి వంతు వాళ్లు. లెక్కలు చూడలేదు, కారణాలు అడగలేదు. "మన ప్రవీణ్ ఆపదలో ఉన్నాడురా" అనే ఒక్క మాట వినపడగానే అన్నగా నిలబడ్డారు.

**ఆదివారం... కన్నీళ్ల మధ్య చేయూత**

ఆదివారం. 26 ఏళ్ల తర్వాత స్కూల్ బెంచీలు గుర్తొచ్చాయి. సారపాకలో ప్రవీణ్ ఇంటి ముందు నిలబడ్డారు. ఒకరి చేతిలో కవరు, మరొకరి చేతిలో నిత్యావసర సంచులు.

రా ప్రవీణ్... నువ్వు లేవాలి. గణేష్ కోసమైనా నువ్వు కోలుకోవాలి" అంటూ అతని భార్యను ఓదార్చారు. కవరులో 55 వేల రూపాయలు పెట్టారు. "ఇది వైద్యానికి... మందులకు" అన్నారు. పక్కనే 3 నెలలకు సరిపడా 15 వేల రూపాయల సరుకులు అందించారు. "ఇంట్లో పిల్లలు ఉన్నారు కదా... నువ్వు త్వరగా లేవాలి" అంటూ గొంతు వణికింది వాళ్లకు.

**"మేమూ ఉన్నాం" అన్న మరో బ్యాచ్**

199798లో సారపాక గవర్నమెంట్ స్కూల్లో 7వ తరగతి కలిసి చదివిన స్నేహితులు కూడా వచ్చారు. వాళ్లు కూడా 10 వేల రూపాయలు అందించారు. "ప్రవీణ్, మేమంతా ఉన్నాం. ధైర్యంగా ఉండు" అని భరోసా ఇచ్చారు.

**...అయిపోయింది చదువు.. స్నేహం కాదు**

ప్రవీణ్ భార్య కళ్లనీరు ఆపుకోలేకపోయింది. "అయ్యా చనిపోయాడు... కొడుకు పోయాడు... భర్త ఆస్పత్రిలో ఉన్నాడు. ఈ లోకంలో ఎవరూ లేరనుకున్నా. వీళ్లు వచ్చి మళ్లీ జీవితం ఉందని చూపించారు" అని కన్నీళ్లతో చెప్పింది. స్నేహితులు మాత్రం ఒక్క మాట అన్నారు ప్రవీణ్... మార్కులు తక్కువ వచ్చినా, ఫెయిల్ అయినా నువ్వు మా బెంచ్ పార్టనర్‌వి. ఆపదలో మిత్రుడికి చేయి అందించడం కంటే పెద్ద చదువు ఏముంది? పెద్ద పెద్ద స్టేటస్‌లు పెట్టుకుంటారు . కష్టంలో ఎవరూ రారు. వీళ్లు వచ్చారు. స్నేహానికి ఇదే నిజమైన అర్థం" అని సారపాక వాసులు చెప్పుకుంటున్నారు.

**ముగింపు మాట:**

డబ్బు తాత్కాలికం... కానీ ఆపదలో అందించే చేయూత శాశ్వతం. ప్రవీణ్ త్వరగా కోలుకోవాలని, గణేష్ ఆత్మకు శాంతి కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

## వీబీజీ రాంజీ చట్టాన్ని రద్దు చేసి ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య



**దశ, మణుగూరు :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న వీబీజీ రాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేసి, ప్రస్తుతం అమలులో ఉన్న ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. సోమవారం మణుగూరులో సీపీఎం మండల ముఖ్య బాధ్యుల సమావేశం కామ్రేడ్ పిట్టల నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ, గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారని అన్నారు.

అయితే కేంద్ర ప్రభుత్వం దాని స్థానంలో వీబీజీ రాంజీ చట్టాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. కొత్త చట్టంలో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించాల్సి రావడంతో రాష్ట్రాలపై అదనపు భారం పడుతుందని, దీనివల్ల పేదలకు ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద 125 రోజుల పనిని కల్పించాలంటే సంవత్సరానికి సుమారు రూ.3.5 లక్షల కోట్ల బడ్జెట్ అవసరమని, కానీ కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కేవలం రూ.95 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. ఇది ఉపాధి పనుల్లో కోత విధించేందుకు తీసుకున్న చర్యేనని ఆరోపించారు. అందువల్ల వీబీజీ రాంజీ చట్టాన్ని ఉపసంహరించుకుని, పాత విధానంలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న, మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు తోట పద్మ, కొండ్రు గౌరీ, బోడ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఐదు పంచాయతీల విలీనంపై ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదన

- జిల్లా అదనపు కలెక్టర్ స్పష్టీకరణ

**దశ, భద్రాచలం:** భద్రాచలంతో ఐదు పంచాయతీల విలీన అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉన్న ప్రతిపాదన అని జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ప్రజా సంఘాల జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా, అదనపు కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వం ఈ అంశంపై నిర్ణయం తీసుకునే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. అనంతరం ప్రజా సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర విభజన అనంతరం భద్రాచలం భౌగోళికంగా నష్టపోయిందని పేర్కొన్నారు. ఐదు పంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లో ఉండడం వల్ల ప్రజలు పరిపాలనా, విద్య, వైద్యం, ఉపాధి తదితర రంగాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. భద్రాచలంతో ఈ పంచాయతీలు విలీనం అయితే అభివృద్ధికి ఊతమిచ్చే అవకాశం ఉంటుందని, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా సేవలు మరింత చేరువవుతాయని అభిప్రాయపడ్డారు. వినతిపత్రంలోని అన్ని అంశాలపై అధికారులు సానుకూలంగా స్పందించారని, ముఖ్యంగా ఐదు పంచాయతీల విలీనంపై ప్రభుత్వం నిర్ణయం ప్రకటిస్తుందని అదనపు కలెక్టర్ వెల్లడించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. సమస్యలపై స్పందించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

- 500 నుంచి 750 చ.అ. మధ్యే స్లాబ్
- లబ్ధిదారులపై అదనపు భారం తగ్గించేందుకు జీఓ
- ఎంపీడీవో జములా రెడ్డి హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్



**దశ బూర్గంపాడు:** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలన్న లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేస్తోంది. తాజాగా ఇళ్ల స్లాబ్ సైజుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.గృహ నిర్మాణశాఖ ఎండీ వీ.పీ. గౌతమ్ ఇటీవల జీఓ విడుదల చేశారని బూర్గంపహాడ్ ఎంపీడీవో జమలారెడ్డి, హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్ లు తెలిపారు. ఇకపై ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ విస్తీర్ణం 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్య మాత్రమే ఉండాలని జీఓలో స్పష్టం చేశారు.స్లాబ్ ముందువైపు 3 అడుగులు మిగతా వైపులా 1 అడుగు మాత్రమే పొడిగించేందుకు అనుమతి ఉందని అధికారులు వివరించారు. దీనికి మించి స్లాబ్ విస్తీర్ణం పెంచరాదని,పేద, మధ్యతరగతి లబ్ధిదారులపై అదనపు ఖర్చు భారం పడకూడదనే ఉద్దేశంతోనే ఈ పరిమితులు విధించినట్లు హౌసింగ్ కార్పొరేషన్ పేర్కొంది.

స్లాబ్ సైజులు పెంచడం వల్ల ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షల ఆర్థిక సహాయం కంటే అదనపు ఖర్చు భారం పడుతోందని గుర్తించిన కార్పొరేషన్ ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు.ఇళ్లకు నీడ అవసరమైతే అన్ని వైపులా స్లాబ్ పొడిగించే బదులు తలుపులు, కిటికీలపై సన్షెడ్లు/చజ్జాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించిందని తెలిపారు.

ఇంటి ముందు భాగంలో అదనపు నీడ అవసరమైతే ఆర్సీసీ స్లాబ్‌కు బదులు జీఐ షీట్ ఆధారిత షెడ్లు వేసుకోవాలని తెలిపారు.ఈ కొత్త నిబంధనలు పునాది దశ, బేస్మెంట్ లెవల్, గోడల దశలో ఉన్న ఇళ్లకు, అలాగే గ్రౌండింగ్ చేసి ఇంకా నిర్మాణం ప్రారంభించని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మాత్రమే వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఇప్పటికే స్లాబ్ వేసిన ఇళ్లకు ఈ నిబంధనలు వర్తించవని పేర్కొన్నారు.లబ్ధిదారులు కొత్త మార్గదర్శకాల ప్రకారమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, అనుమానాలు ఉంటే మండల హౌసింగ్ అధికారులను సంప్రదించాలని ఎంపీడీవో జమలారెడ్డి, ఏఈ ఉదయ్ కిరణ్ సూచించారు.



## విద్యార్థులు 100% పాఠశాలకు హాజరయ్యేలా చూడాలి

- జిల్లా విద్యాధికారి వాసంతి
- రికార్డులు పరిశీలన నలుగురు ఉపాధ్యాయులు గైర్హాజరు
- మూడు రోజులలో వివరణ ఇవ్వాలని ఆదేశం.

**దశ బూర్గంపాడు:** మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి సోమవారం ఆకస్మికంగా సందర్శించినారు. విద్యార్థులు ఉపాధ్యాయుల యొక్క హాజరును ఫేస్ రికగ్నిషన్ యాప్ ఎస్ ఆర్ ఎస్ లో పరిశీలించి, నలుగురు ఉపాధ్యాయులు గైర్హాజరవ్వడం గమనించి మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వవలసిందిగా సిబ్బందిని ఆదేశించారు. కొత్త అడ్మిషన్లు పరిశీలించి ఎన్రోల్మెంట్ ను ఇంకా పెంచాలని సూచించారు.వంట సామాగ్రి, సరుకులు, వంటగది టాయిలెట్స్ ను పరిశీలించి, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించి వారి సామర్థ్యలను పరిశీలించి, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా మొదలగు వాటిని ఉపయోగించుకుంటూ విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు.ఎటి పరిస్థిలో ఎవరూ కూడా పాఠశాలకు గైర్హాజరు అవ్వద్దని విద్యార్థులకు సూచించారు.ఒక వారం రోజుల్లో మరల పాఠశాలకు తిరిగి వస్తానని, ఈసారి వచ్చేలోగా అందరు విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా హాజరయ్యేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమం లో అధికారులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.